సాక్షి తిరుపతి

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం

తిరుచానూరు శ్రీ పద్మావతి ఆలయంలో వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం చేసినట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు - IIలో



లవ్ అండ్ ఎమోషనల్ చిత్రం

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రం లవ్ అండ్ ఎమోషనల్‌గా ఉంటుందని ఆ చిత్రం హీరో నవీన్ పొలిశెట్టి తెలిపారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	38	27
చిత్తూరు	37	26
తిరుమల	33	22
గూడూరు	39	28
నగరి	38	26

న్యూస్‌రీల్

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి మూడో సారి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి 27వ తేదీలోపు ''ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్'' వెబ్‌సైట్‌లో కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న తరువాత సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన వారికి 30వ తేదీ, ప్రైవేటు ఐటీఐల్లో చేరదలచిన వారికి 31వ తేదీ వరకు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన విద్యార్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపించరని తెలిపారు. మరిన్ని వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942ను సంప్రదించాలని ఆమె కోరారు.

నిబంధనల మేరకు రీ-వెరిఫికేషన్



మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు

సత్యవేడు: ఎన్నికల కమిషన్ నిబంధనలమేరకు నెలాఖరులోగా రీ వెరిఫికేషన్ పకడ్బందీగా చేపట్టనున్నట్లు డిప్యూటీ కలెక్టర్, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం సత్యవేడు రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరుజాబితా సవరణలో చేపట్టిన ఇంటింటి సర్వే 90 పూర్తయిందన్నారు. రీ వెరిఫికేషన్ కోసం బీసీ వెల్‌ఫేర్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఒకే ఇంట్లో ఎక్కువ మంది ఓటర్లు ఉండి, ఆ ఇంటిలో ఎక్కువ పోర్షన్లు ఉంటే నోషనల్ ఇంటి నంబరు ఇవ్వాలని సూచించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి లిఖిత పూర్వకంగా తెలపాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఓటర్లు 2,06,212 నమోదైనట్లు వెల్లడించారు. షిఫ్టింగ్ 1,777, చనిపోయినవారు 2,204, డబుల్ ఎంట్రీ 228 ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ జరీనా బేగం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, బీజేపీ నాయకులు బందారు మోహన్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఆశ్రమాలు అవసరం



ఆశ్రమ భూమిపూజలో పాల్గొన్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక ఆశ్రమాలు అత్యవసరమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని తుపాన్‌సెంటర్‌లో అత్య ఆశ్రమం సద్గురు సుబ్రహ్మణ్యస్వామికి తెలంగాణ జిల్లా వికారాబాద్‌వాసులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తండ్రి లక్ష్మణ్‌రెడ్డి దాదాపు రూ.5 కోట్లతో ఆధ్యాత్మిక ఆశ్రమ నిర్మాణం చేపట్టారు. ఈ ఆశ్రమ భూమిపూజ కార్యక్రమానికి అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఇప్పటికే శుకబ్రహ్మాశ్రమం ద్వారా ప్రజలకు ప్రవచనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం మా గురువు పుస్తకాన్ని ఆవిష్కరించి, సద్గురు సుబ్రమణ్యస్వామి చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యోగేంద్రనాథ్, శెట్టిపల్లి సురేష్, నాగరాజు, రమణయ్య, దామోదరం, సెల్వరాజు, నాగమల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,122 మంది స్వామివారిని దర్శించుకోగా, 29,121 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకలు రూ.3.76 కోట్లు అందాయి. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చంద్రయాన్–3 విజయంలో కీలక పాత్ర పోషించిన అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన శ్రీకాళహస్తి స్వగ్రామం తడుకుపేటలో సంబరాలు మిన్నంటాయి. 'ఆమె మా అక్కే.. మా పెద్దనాన్న కూతురే.. నా మేనత్త కూతురే' అంటూ వరసలు కలుపుతూ స్థానికులు ఉప్పొంగిపోయారు. మిఠాయిలు పంచుతూ, టపాకాయలు కాల్చుతూ సందడి చేశారు. చంద్రయాన్ విజయంలో 'మా ఊరి బిడ్డ' భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందంటూ మురిసిపోయారు. ఇక్కడే పుట్టి.. అందరితో కలిసిమెలిసి తిరిగి నేడు గగన విజయ యాత్రలో కీలక భూమిక పోషిస్తున్నందుకు గర్వంగా ఉందని సంబరపడ్డారు. ఆడపడుచు కృషిని శ్లాఘిస్తూ శ్రీకాళహస్తి వాసులు ఆనందం వ్యక్తం చేశారు. జయహో కల్పన.. భారత్‌మాతాకీ జై అంటూ జేజేలు పలికారు. ఆమెతో ఉన్న అనుబంధాలు, మధుర క్షణాలను నెమరు వేసుకుని ఆనంద సాగరంలో మునిగిపోయారు.



గఘన విజయంలో.. మా ఊరి కల్పన

- చంద్రయాన్–3 మిషన్ బృందంలో తడుకుపేట వాసి కల్పన
- చంద్రయాన్ విజయంలో కీలకపాత్ర
- చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న బంధువులు, గ్రామస్తులు
- మిఠాయిలు పంచుతూ, టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకున్న స్థానికులు



కల్పన

నగరి: విశ్వ ఘనత సాధించిన మిషన్ డిప్యూటీ డైరెక్టర్ కల్పన స్వగ్రామం నగరి మండలం, తడుకుపేటలో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. చంద్రయాన్–3 ప్రయోగంలో 'మాఊరి కల్పన' అంటూ గ్రామస్తులు కేరింతలు కొట్టారు. గ్రామంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఊర్లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి కుటుంబ సమేతంగా వస్తుంటారంటూ సంబరపడ్డారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ కన్నియప్ప విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ జయహో భారత్.. అంటూ నినాదాలు చేస్తూ కల్పనకు తమ అభినందనలు తెలిపారు. ప్రపంచమే తిరిగి చూసేలా చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగిడిన తొలి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించడం వెనుక మా ఊరి బిడ్డ కృషి ఉండడం మాకెంతో గర్వకారణమంటూ సంబరపడిపోయారు.



సంబరాలు చేసుకుంటున్న తడుకుపేట గ్రామస్తులు



తడుకుపేటలో స్వీట్లు తినిపించుకుంటున్న విద్యార్థినులు

కల్పన నేపథ్యం ఇదీ

కల్పన తండ్రి మునిరత్నం మొదట్లో స్వగ్రామం తడుకుపేటలోనే ఉన్నారు. ఈయన తిరుత్తణికి చెందిన ఇందిరను వివాహం చేసుకున్నారు. హైకోర్టు బెంచ్‌క్లర్కుగా ఉద్యోగం సంపాదించడంతో కుటుంబం చెన్నై, అంబత్తూరుకు వెళ్లి స్థిరపడింది. అక్కడే కల్పన మద్రాసు యూనివర్సిటీలో బీటెక్ ఈసీఈ చదివారు. ఈమెకు శ్రీకాళహస్తికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సునీల్‌తో వివాహం జరిగింది. ఇస్రోలో స్పేస్‌సెంటర్ రాడార్ ఇంజినీర్‌గా 2000లో చేరారు. 2005లో యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ బెంగళూరుకు శాటిలైట్ బిల్డింగ్ ఇంజినీర్‌గా పదోన్నతిపై వెళ్లారు. గతంలో సెకండ్ లూనార్ మిషన్‌లోనూ, మంగళ్‌యాన్ మిషన్‌లోనూ పనిచేసిన అనుభవం ఉంది. ఈమె చంద్రయాన్–3లో అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రధాన పాత్ర పోషించారు. ఈమెకు ఒక కుమార్తె ఉంది.

కల్పనను అభినందించిన మంత్రి



చంద్రయాన్–3 విజయంలో ముఖ్యపాత్ర పోషించిన కల్పనను మంత్రి ఆర్కే రోజా ఫోన్ ద్వారా అభినందించారు. విశ్వవ్యాప్తంగా దేశకీర్తిని ఇనుమడింపజేసిన చంద్రయాన్ ప్రాజెక్టులో ప్రాధాన్యత వహించిన కల్పనది తమ నియోజకవర్గంలోని తడుకుపేట స్వస్థలం కావడం గర్వకారణంగా ఉందని చెప్పారు.

జయహో ఇస్రో



చిట్టమూరు జీఎంఎన్ జెడ్పీహైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

ఆడపడుచుకు అందలం



శ్రీకాళహస్తి: శుకబ్రహ్మాశ్రమంలో సంబరాలు

మిన్నంటిన సంబరం



యాదమరి: అగరంపల్లెలో ర్యాలీ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చంద్రదరహాసం



నగరి: తడుకుపేటలో సంబరాలు చేసుకుంటున్న గ్రామస్తులు

మా ఊర్లోనే పుట్టింది



నేడు దేశమంతా గర్వించేలా చేసిన చంద్రయాన్–3 బృందంలోని కల్పన మా గ్రామంలోనే పుట్టింది. ఆమె మా మేనమామ కుమార్తే. బంధువుల పెళ్లిళ్లు, వేడుకల్లో కలుస్తుంది. గ్రామంలో జరిగే వేడుకల్లోనూ కలుసుకుంటూ ఉంటుంది. అంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా భేషజాలు ఏమీ ఆమెలో కనిపించవు. నేడు ఇంత పేరుప్రతిష్టలు తెచ్చిందంటే అది మా గ్రామానికే గర్వకారణం.

– శారద, తడుకుపేట

సైంటిస్ట్ కావాలన్నదే ఆమె కోరిక



నేడు ఇంతటి పేరుప్రతిష్టలు సాధించిన కల్పన తండ్రి మునిరత్నం నాకు పెదనాన్న అవుతారు. ఆమె అక్కవుతుంది. ఆమెకు చిన్నతనం నుంచే సైంటిస్ట్ కావాలన్న కోరిక ఉండేది. అందుకే బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదివింది. ఇస్రోలో ఉద్యోగం సంపాదించింది. నేడు దేశానికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన ఒక బృందంలో ఆమె ఉందంటే మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది.

– కే.ధర్మేష్, తడుకుపేట

ఆలయ ఉత్సవాలకు వస్తుంటారు



గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్పన తండ్రి మునిరత్నం ట్రస్టీ మెంబర్. ప్రతి ఏడాదీ గ్రామంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి కల్పన వస్తూ ఉంటారు. అప్పుడప్పుడూ కల్పన కూడా కలుస్తూ ఉంటుంది. నాకు మేనమామ కుమార్తె అవుతుంది. చిన్నతనం నుంచే చదువులో దిట్ట. నేడు మేమంతా గర్వపడేంతలా పేరుప్రతిష్టలు సాధించింది.

– ప్రసాద్, తడుకుపేట

ఇక్కడ ఇంటి స్థలం కూడా ఉంది



కల్పన నాకు మేనత్తకూతురు. అప్పుడు వారు పూరింట్లో ఉండేవారు. కల్పన తండ్రి హైకోర్టులో బెంచ్‌క్లర్క్. కల్పన పుట్టిన కొన్నాళ్లకే తిరుత్తణికి వెళ్లిపోయారు. అటు పిమ్మట చెన్నైకు వెళ్లి స్థిరపడ్డారు. వారున్న ఇల్లు పూర్తిగా కూలిపోగా స్థలం మాత్రం అలాగే ఉంది. వారున్న వీధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వేడుకలకు వస్తుంటారు. ఆ సమయంలో ఇంటి స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు శుభ్రం చేసి వెళుతుంటారు.

–ఏ.ధనంజయులు, తడుకుపేట

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లాలో 6,303 మందికి లబ్ధి
- రూ.9.28 కోట్ల చెక్కు పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో అర్హత ఉండి ఏ కారణం చేతనైనా పథకాలు అందకుండా మిగిలిపోయి ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం నేడు సంక్షేమ ఫలాలు అందించిందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి లబ్ధిదారులకు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరూ నవరత్నాలైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలన చేసి ద్వై వార్షిక విధానంలో అర్హతగల వారికి(తప్పిపోయి అర్హతన ఉన్నవారికి) లబ్ధి కలిగేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి జిల్లాలో 6,303 మందికి రూ.9.28 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. ఆ చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. గత మాసంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హత ఉండి పథకాలు పొందని వారికి న్యాయం చేసినట్లు చెప్పారు. ప్రతి ఆరు మాసాలకు అర్హతను గుర్తించి పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం 4వ దశగా ద్వై వార్షిక విధానంలో అర్హతగల వారికి లబ్ధి కలుగుతున్నదని చెప్పారు. ఇప్పటికీ ఎవరైనా అర్హత ఉండి పథకాలు అందకుండా ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి మరో 30 రోజుల సమయం ఉందని వెల్లడించారు. 4వ దశగా ద్వై వార్షిక విధానంలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం 1,121 మందికి రూ.2.76 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకానికి 1,279 మందికి రూ.1.12 కోట్లు, జగనన్న విద్యా దీవెనకు 1,559 మందికి రూ.2.39 కోట్లు, అమ్మఒడి పథకానికి 669 మందికి రూ.1కోటి, చేదోడు 1209 మందికి రూ.1.21 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 324 మందికి రూ.49 లక్షలు, మత్స్యకార భరోసా ఆరుగురికి రూ.60 వేలు, నేతన్న నేస్తం కింద 7 మందికి రూ.17 లక్షలు, వ్యవసాయ శాఖకు సంబంధించి 129 మందికి రూ.80 వేలు లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు రూ.9.28 కోట్ల మెగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, డీఎల్‌డీవో సుశీలాదేవి, మెప్మా పీడీ రాధమ్మ, డీఆర్‌డీఏ అధికారులు సుబ్బారెడ్డి, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

మాకు అమ్మఒడి వచ్చింది



మేము అర్హులైనప్పటికీ ఎందుకో అమ్మఒడి డబ్బులు మా ఖాతాలో పడలేదు. ఈ విషయం మా వలంటీర్‌కు చెప్పాం. రెండో దశలో వస్తుందని చెప్పారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పుడు అమ్మఒడి వచ్చింది. పేదలకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

–విజయశ్రీ, జీవకోన, తిరుపతి

అర్హులందరికీ న్యాయం



నేను ఇస్త్రీ పని చేసుకుంటున్నాను. సచివాలయం వెళ్లి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇప్పుడు జగనన్న చేదోడు పథకం కింద లబ్ధి పొందాను. చాలా సంతోషంగా ఉంది. పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

– మునిరత్నం, తిరుపతి


రేపటి నుంచి విద్యుత్ బస్‌చార్జీల తగ్గింపు

బస్సు రూట్	పాత చార్జీ	కొత్త చార్జీ
తిరుపతి–మదనపల్లి	రూ.300	రూ.260
తిరుపతి–నెల్లూరు	రూ.350	రూ.300
తిరుపతి–కడప	రూ.340	రూ.290

తిరుపతి అర్బన్: విద్యుత్ బస్సుల చార్జీలు శనివారం నుంచి తగ్గిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 27న విద్యుత్ బస్సులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. కాలుష్య నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా తిరుపతిలోని అలిపిరి డిపో కేంద్రంగా వంద విద్యుత్ బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో తిరుపతి నుంచి తిరుమలకు 50 విద్యుత్ బస్సులు, తిరుపతి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు 14, తిరుపతి నుంచి కడపకు 12, తిరుపతి నుంచి మదనపల్లికి 12, తిరుపతి నుంచి నెల్లూరుకు 12 విద్యుత్ బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ విద్యుత్ బస్సుల్లో చార్జీలను తగ్గించినట్లు స్పష్టం చేశారు.

పూజకు వేళాయె..





తిరుపతి జిల్లాలో వరలక్ష్మీవ్రతం సందడి నెలకొంది. శుక్రవారం వ్రతాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. పూజకు కావాల్సిన సరంజామా కొనుగోలుకు భక్తులు తరలిరావడంతో గురువారం తిరుపతిలోని గాంధీ రోడ్డు కిక్కిరిసిపోయింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, తిరుపతి

తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నేదురుమల్లి

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ కమిటీని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి (వెంకటగిరి), ఉపాధ్యక్షులుగా ఎం.సోమశేఖర్‌రెడ్డి(సూళ్లూరుపేట), ఎం.రవిచంద్రారెడ్డి(తిరుపతి), ప్రధాన కార్యదర్శులుగా కే.మణి(సత్యవేడు), సి.తిరుమలరెడ్డి(శ్రీకాళహస్తి), దువ్వూరు మధుసూదన్‌రెడ్డి(గూడూరు), కోశాధికారిగా వి.విక్రమ్‌రెడ్డి(చంద్రగిరి), కార్యదర్శులుగా కామిరెడ్డి కసూర్తిరెడ్డి(గూడూరు), కే,చంద్రశేఖర్(సత్యవేడు), సి.హరికృష్ణా(వెంకటగిరి), ఎస్.రమేష్‌బాబు(శ్రీకాళహస్తి), వి.ద్వారకనాథ్‌చౌదరి(తిరుపతి), వి.కిషోర్(సూళ్లూరుపేట), కమలగుంట జనార్దన్‌రెడ్డి(చంద్రగిరి) ఈసీ మెంబర్లుగా కే.రఘురాంరెడ్డి(తిరుపతి), నాదముని(తిరుపతి), యోగాంజనేయరెడ్డి(తిరుపతి), దినేష్‌రాయల్(తిరుపతి), సి.జయంత్(చంద్రగిరి), గిరిధర్‌రెడ్డి తిమ్మారెడ్డి(చంద్రగిరి), కే.భాస్కర్‌రెడ్డి(చంద్రగిరి), ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి(చంద్రగిరి), కే.భారతి(సూళ్లూరుపేట), బి.రమణయ్య(సూళ్లూరుపేట), సి.రాధాకృష్ణన్(సూళ్లూరుపేట), వి.శ్రీనివాసన్(సూళ్లూరుపేట), బి.సురేష్(సత్యవేడు), ఎస్‌కే.మస్తానీ(సత్యవేడు), పి.బాలసుబ్రమణ్యం(సత్యవేడు), జి.సునీత(సత్యవేడు), పి.కృష్ణయ్య(వెంకటగిరి), ఇ.రాములమ్మ(వెంకటగిరి), వి.ప్రభాకర్‌రెడ్డి(వెంకటగిరి), కే.చెంచురామిరెడ్డి(వెంకటగిరి), సి.రుషేంద్రముని(శ్రీకాళహస్తి), ఓ.రమేష్(శ్రీకాళహస్తి), వై.హరినాథరెడ్డి(శ్రీకాళహస్తి), వి.ఇందిరా(శ్రీకాళహస్తి), సి.నీలిమ(గూడూరు), ఎ.శ్రీనివాసులురెడ్డి(గూడూరు), వి.శారద(గూడూరు), ఎ.మురళీ(గూడూరు)ని నియమించారు.

వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం

- భక్తులకు ఇబ్బందుల్లేకుండా విస్తృత ఏర్పాట్లు
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో గురువారం జేఈవో వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. 500 మంది గృహస్తులు నేరుగా టికెట్లు కొనుగోలు చేసి ఆస్థాన మండపంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 778 మంది గృహస్తులు వర్చువల్ సేవ టికెట్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని జేఈవో అధికారులకు సూచించారు.

ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు జేఈఓ తెలిపారు. అన్నప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలని, భజన బృందాలను ఏర్పాటు చేయాలని హిందూ ధర్మప్రచార పరిషత్ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపడుతున్నట్లు తెలిపారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారాలు అందించేందుకు వీలుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జేఈవో, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్ ఈఈలు మనోహర్, నరసింహమూర్తి, ఏఈవో రమేష్, డీఈ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, అదనపు హెల్త్ ఆఫీసర్ డా.సునీల్, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన బాలిశెట్టి



సీఎంతో బాలిశెట్టి కిషోర్, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు, తిరుపతి నియోజక వర్గ జేసీఎస్ కన్వీనర్ బాలిశెట్టి కిషోర్ మర్యాద పూర్వకంగా కలిశారు. చురుగ్గా పనిచేస్తాడని పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు సజ్జల భార్గవ్ చెప్పగా సీఎం జగన్ బాలిశెట్టి కిషోర్‌ని అభినందించారు.

నిధులు విడుదల

తిరుమల: హిందూ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా రాష్ట్రంలో టీటీడీ ఆర్థిక సహాయంతో నిర్మించిన 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం ఆగస్టుకు గాను ఒక్కో ఆలయానికి రూ.5 వేలు చొప్పున 25 లక్షలా 5 వేల రూపాయలు గురువారం శ్రీవాణి ట్రస్ట్ నిధుల ద్వారా విడుదల చేసినట్లు టీటీడీ పీఆర్వో విభాగం పేర్కొంది.

టీటీడీ చైర్మన్‌కు సుమన్ సత్కారం

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ప్రముఖ సినీ నటుడు సుమన్ గురువారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పుష్పగుచ్ఛంతో భూమనకు అభినందనలు తెలిపారు.



టీటీడీ చైర్మన్‌ను సత్కరిస్తున్న సినీ హీరో సుమన్

ప్రతి పల్లెకు సంక్షేమ పథకాలు




పేరూరులో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి పల్లెకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. పదవులు హోదా కోసం కాదని, సేవ చేయడానికి ప్రజలిచ్చిన బాధ్యతగా భావించాలి అన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని రామానుజ పల్లి, గొల్లపల్లి, పాతకాల్వ, సి.మల్లవరం, పుదిపట్ల, చెర్లోపల్లి, వెంకటపతి నగర్, పేరూరు, కుంట్రపాకం, తనపల్లి, దుర్గ సముద్రం, కేసిపేట, చిగురువాడ, మల్లంగుంట, వేదాంతపురం, అవిలాల, గాంధీ పురం పంచాయతీల్లో గురువారం ఆయన పర్యటించారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఏ మేరకు పరిష్కరించారని ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న వినతులను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఆయా పంచాయతీల్లో పలు సమస్యలను మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో, చంద్రగిరి నియోజకవర్గంలో పాలన కొనసాగుతోందన్నారు. రాజకీయాలకు, కులాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేసినట్లు వెల్లడించారు. జగనన్న ఆశీస్సులతో 2024 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లవ్, ఎమోషనల్ చిత్రం

తిరుపతి కల్చరల్: కామెడీతో పాటు మంచి లవ్, ఎమోషనల్ కథతో రూపొందించిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రమని ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని ఆ చిత్రం హీరో నవీన్ పోలిశెట్టి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 7న ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో ప్రమోషనల్ యాత్రను తిరుపతి నుంచి ప్రారంభించారు. ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ చిత్రం హీరో నవీన్ పోలిశెట్టి చిత్రం విశేషాలను పంచుకున్నారు. తాను నటించిన తొలి చిత్రం జాతిరత్నాలు చక్కటి కామెడీని ప్రేక్షకులకు అందించి ఆదరణ పొందాన్నారు. ఇదే స్థాయిలో తాను హీరోగా అనుష్క హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మంచి హాస్యాన్ని పంచడంతో పాటు చక్కటి ప్రేమ ఎమోషనల్ కథ ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం తాను మూడు సినిమాల్లో నటించనున్నట్లు తెలిపారు. అనంతరం అభిమానుల సెల్ఫీలతో సందడి చేశారు. తర్వాత ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల మధ్య సందడి చేసి ఆకట్టుకున్నారు.



సందడి చేస్తున్న నటుడు నవీన్ పోలిశెట్టి

సంస్కృత వర్సిటీలో ఘనంగా ఓనమ్



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం ఓనమ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఈ యూనివర్సిటీలో విభిన్న సంస్కృతులు గల విద్యార్థులు ఉన్నారని, ప్రతి రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను వర్సిటీ గౌరవిస్తుందన్నారు. అనంతరం కేరళ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు

తిరుపతి క్రైం: గంజాయి స్మగ్లింగ్ ముఠాను రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర రెడ్డి వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో నోడల్ అధికారి ఎ.రాజేంద్ర పర్యవేక్షణలో, తిరుపతి రూరల్ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఎస్ఐ భాస్కర్, సిబ్బంది రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. అక్కడే అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని వారిని తనిఖీ చేయగా సుమారు రూ.4,86,000 విలువ చేసే 54 కిలోల 27 ప్యాకెట్ల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఒడిశా నుంచి కొనుగోలు చేసి, రేణిగుంట మీదుగా ముంబైకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తిరుపతి తుడా కార్యాలయం సమీపంలోని వినాయకనగర్‌కు చెందిన లేపాక్షి బాబా ఫక్రుద్దీన్‌కు చెందిన ముఠా ఇలాంటి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు చెప్పారు. ముంబైలోని రాహుల్, దేవదాస్ అనే వ్యక్తులకు విక్రయించేందుకు వీరు బయల్దేరారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న సమయంలో ఈ స్మగ్లింగ్ ముఠాను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వినాయక నగర్‌కు చెందిన లేపాక్షి బాబా ఫక్రుద్దీన్ (53), లేపాక్షి మహ్మద్ అరీఫ్, అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన అలిమిశెట్టి రాధిక, చిత్తూరు జిల్లా విజయపురం గ్రామానికి చెందిన.ఎస్ షారిభా ఉన్నట్లు వివరించారు.



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

గుండె తరలింపులో పోలీసుల చొరవ

చిల్లకూరు: అవయవ దానం చేసిన వారి నుంచి సేకరించిన గుండె తరలింపులో స్థానిక పోలీసులు చొరవ చూపారు. నెల్లూరు అపోలో ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరించిన గుండెను తిరుపతికి తరలించాల్సి వచ్చింది. దీంతో మండల పరిధిలో గూడూరురూరల్ సీఐ దశరథ రామారావు ఆధ్వర్యంలో గ్రీన్ చానల్ ద్వారా అంబులెన్స్‌లో ఉదయం 11 గంటలకు గుండెను తిరుపతికి తరలించేలా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



గుండెను తరలిస్తున్న అంబులెన్స్‌కు మార్గం సుగమం చేస్తున్న పోలీసులు

ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత

గూడూరు రూరల్: స్థానిక రెండో పట్టణ పరిధిలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లు అందించారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రతి గురువారం వైద్య సిబ్బంది ఐరన్ టాబ్లెట్లను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఐరన్ టాబ్లెట్‌లు వేసుకున్న ఐదుగురు విద్యార్థినులు ఆటలు ఆడేందుకు గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ కళ్లు తిరిగి పడిపోవడంతో వారిని హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గత రెండు రోజులుగా పాఠశాలకు నీటి సరఫరా సక్రమంగా లేదని, దీంతో మాత్రలు వేసుకున్న విద్యార్థినులు నీళ్లు తాగలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ క్రమంలోనే గ్రౌండ్‌లో ఆటలు ఆడుతున్న సమయంలో కళ్లు తిరుగుతున్నాయని తెలపడంతో విద్యార్థినులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినట్లు తెలిపారు.

ఆలయాల్లో ఆరాధన మహోత్సవం

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామంలో వెలసిన తీర్థం వెంకయ్యస్వామి, మోపూరురోడ్డు, చాపలపల్లి గ్రామాల్లోని వెంకయ్యస్వామి ఆలయాలు గురువారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆ ఆలయాల్లో ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పండరిభజన, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

వెంగమాంబ రచనల్లో స్త్రీ హృదయం



ప్రసంగిస్తున్న విశ్రాంత ఆచార్యుడు సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన రచనల్లో భాష, భావం, భావ వ్యక్తీకరణలో స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించారని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు సర్వోత్తమరావు తెలిపారు. వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు గురువారం అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సాహితీ సదస్సులో ఆచార్య సర్వోత్తమరావు 'వేంకటాచాల మహత్యం- లక్ష్మీదేవి' అనే అంశంపై ప్రసంగించారు. వెంగమాంబ భక్తి రచనల్లో సంసారిక చిత్రాలకు సంబంధించి లక్ష్మీదేవి భర్తను అనుసరించడం, సేవించడం, కల్యాణం, తిరుమల కొండలు వంటి అంశాలతో పాటు ఆనాటి సామాజిక అంశాలను వివరించారని తెలిపారు. తిరుపతికి చెందిన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ విజయం అనే అంశంపై ప్రసంగించారు. చంద్రగిరికి చెందిన డాక్టర్ సంగీతం కేశవులు తరిగొండ వెంగమాంబ సాహిత్యంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి వర్ణనలు- విశిష్టత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సుశీల, డాక్టర్ శ్యాంకుమార్ ఆలపించిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన లావణ్య కుమారి, లక్ష్మీరాజ్యం బృందం సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ లత పాల్గొన్నారు.

ప్రజా జీవితం, కవిత్వ సారమే ఆముక్తమాల్యద

తిరుపతి సిటీ: ప్రపంచంలో శ్రీకృష్ణ దేవ రాయలు వంటి చక్రవర్తి మరొకరు లేరని కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన డాక్టర్ సంగనభట్ల నరసయ్య తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో గురువారం వర్సిటీ సెనేట్ హాల్లో ఆచార్య కె సర్వోత్తమరావు ధర్మనిధి ఉపన్యాసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాజూ గొప్ప కవిగా రాణించలేదని, రాయలు అచ్చ తెలుగు వాడని తెలిపారు. ఆయన జీవిత కాలమంతా శోధించి, ప్రజాజీవితాన్ని, కవిత్వ సారాన్ని తన ఆముక్తమాల్యదలో ఇమిడ్చి ప్రౌఢ ప్రబంధంగా రాశారని అన్నారు. రాయలు ఆరు సంస్కృత గ్రంథాలు రచించిన విషయం చాలామందికి తెలియదన్నారు. ఆయన రాసిన జాంబవతీ పరిణయం అందరం చదవాలన్నారు. రైతులు, వ్యాపారులు, అటవీ ప్రాంత వాసుల జీవితం ఆముక్తమాల్యదలో ఉందన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, అధ్యాపకులు రాజేశ్వరమ్మ, పేట శ్రీనివాసులరెడ్డి, ఆదిశేషయ్య, అశోక్ పాల్గొన్నారు.

రియల్ వ్యాపారి ఇంట్లో చోరీ

చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చొరబడి బంగారు, వెండి వస్తువులతో పాటు నగదును ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు, స్థానిక ప్రశాంతి నగర్‌లో ఉండే కొమ్మినేని నరసింహులు నాయుడు కుమారుడు నాగార్జున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం ఉదయం బెంగుళూరు వెళ్లి, బుధవారం రాత్రి వచ్చాడు. అయితే అప్పటికే తలుపులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో దాచుకున్న బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు 25 సవర్ల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులతోపాటు కొంత నగదును దొంగలు దోచుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు